సాక్షి
గుంటూరు
శనివారం, 1, ఫిబ్రవరి, 2025



నెమలి వాహనంపై భావనారుషి

తెనాలి: షరాఫ్‌బజారులోని శ్రీ భద్రావతి సమేత శ్రీభావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి నెమలి వాహనంపై స్వామిని ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 552.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 2,799 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారికి సారె

నగరంపాలెం: ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆత్మార్పణ దినోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అమ్మవారికి సారె తీసుకొచ్చారు.

కూటమి దెబ్బకు కిటకిట!

ఆదాయం పెంపే లక్ష్యంగా కూటమి ఇచ్చిన ఉత్తర్వులతో ఏపీలో రిజిస్ట్రేషన్ కార్యాలయాలలో రద్దీ నెలకొంది. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంచనున్న నేపథ్యంలో రెండు రోజులుగా ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా సీఎఫ్‌ఎంఎస్ సర్వర్లు గురువారం మొరాయించాయి. రాత్రి 9 గంటల వరకు క్రయవిక్రయదారులు ఎదురు చూడాల్సి వచ్చింది. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచే కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చింది. సర్వర్లు నిలిచిపోకుండా అధికారులు చర్యలు తీసుకున్నట్లు చెబుతున్నారు.

- రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రద్దీ
- భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపే కారణం
- చివరిరోజు పోటెత్తిన క్రయవిక్రయదారులు
- కార్యాలయాల్లో కనీస వసతులూ కరవే



గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ ప్రాంగణంలో క్రయవిక్రయదారులు

లక్ష్మీపురం: ప్రతి కార్యాలయం పరిధిలో సాధారణ రోజుల్లో సగటున 10 నుంచి 50 డాక్యుమెంట్ల వరకు అదనంగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. గురువారం ఒక్క రోజే గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు వెయ్యికిపైగా రిజిస్ట్రేషన్లు జరిగినట్లు జిల్లా అధికారి చెబుతున్నారు. గుంటూరు నగర పరిధిలో 15 నుంచి 20 శాతం వరకు భూములు, రిజిస్ట్రేషన్‌ల ధరలు పెరిగాయి. బ్రాడీపేట, అరండల్‌పేట, లక్ష్మీపురం, బృందావన్‌గార్డెన్స్, పట్నంబజార్ వంటి ప్రాంతాల్లో ఈ ప్రభావం ఉంది. స్థిరాస్తి వ్యాపారం బాగా జరుగుతున్న నల్లపాడు, బుడంపాడు, ఏటుకూరు, గోరంట్ల వంటి ప్రాంతాలతో పాటు పెదకాకాని, మంగళగిరి, జాతీయ రహదారుల ఇరు వైపులా పొలాలు, స్థలాల ధరలు ఒక మోస్తరుగా పెరిగాయని అధికారులు చెబుతున్నారు.

కనీస వసతులు లేక ఇక్కట్లు..

దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద కనీస వసతులు కూడా లేవు. ఢిల్లీ, హైదరాబాద్, వైజాగ్ వంటి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గురువారం సర్వర్ పని చేయక పోవడంతో ఇబ్బంది పడ్డారు. శుక్రవారం కూడా పడిగాపులు కాయాల్సి వచ్చింది. భారీ మొత్తంలో ప్రభుత్వానికి ఆదాయం తెచ్చుకోవడంపై ఉన్న శ్రద్ధ వసతులు కల్పించడంలో లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆఖరు తేదీ కావడంతో రద్దీ



ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూములు, రిజిస్ట్రేషన్‌ల చార్జీలు పెంచుతున్న నేపథ్యంలో కార్యాలయానికి క్రయవిక్రయదారులు చేరుకున్నారు. గురువారం కొంత సర్వర్ మొరాయించినప్పటికీ రాత్రికి కార్యకలాపాలు పూర్తి చేశాం. వెయ్యికిపైగా రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం సుమారు 1,500 వరకు అయ్యే అవకాశం ఉంది. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి, మార్చికి ఇచ్చిన టార్గెట్‌కు మించి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నాం

– డి.శైలజ, జిల్లా రిజిస్ట్రార్

పడిగాపులు తప్పలేదు



కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇంత హడావుడిగా రావాల్సి వచ్చింది. శనివారం నుంచి భూములు, రిజిస్ట్రేషన్‌ల ధరలు పెరుగనున్నాయి. ఉదయం 8 గంటలకు వచ్చాము. లోపలికి పత్రాలు పంపించాం. పిలుస్తామని అన్నారు. పాత ధరలతోనే రిజిస్ట్రేషన్ పూర్తి అయితే బాగుండు. – శేషగిరి, గుంటూరు, చైత్ర సెంటర్

మొరాయించిన సర్వర్‌లు

మేమందరం అన్న దమ్ములం. శివనాగప్రసాద్‌కు ఆస్తి రాసి ఇచ్చేందుకు ఢిల్లీ, విశాఖపట్నం, హైదరాబాద్‌ల నుంచి వచ్చాం. గురువారం సర్వర్ పని చేయలేదు. శుక్రవారం ఆఖరు తేదీ కావడంతో కార్యాలయంలో లోపలికి అడుగు పెట్టలేని పరిస్థితి ఉంది.



– మల్లికార్జునరావు, భాస్కర్, నాగేంద్రరావు, శివనాగ ప్రసాద్, చంద్రశేఖరరావు (ఢిల్లీ, హైదరాబాద్, వైజాగ్ వాసులు)

ప్రలోభాల వైపు తమ్ముళ్ల 'స్టాండింగ్'

- గుంటూరులో వేడెక్కిన స్టాండింగ్ కమిటీ ఎన్నికలు
- వైఎస్సార్ సీపీ, కూటమి పార్టీల క్యాంప్ రాజకీయాలు
- కార్పొరేటర్ల కొనుగోలుకు తెరలేపిన కేంద్ర మంత్రి పెమ్మసాని
- రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఎర
- వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొంటున్న టీడీపీ: అంబటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు: అడ్డగోలు హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. తన నైజం మార్చుకోలేదు. అబద్ధాలతో ప్రజల్ని మభ్యపెట్టి పబ్బం గడుపుకొంటున్న పచ్చ పార్టీ నాయకులు... గుంటూరులోనూ అదే బుద్ధిని ప్రదర్శిస్తున్నారు. గుంటూరు మున్సిపల్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలను వేదికగా తమ దుర్బుద్ధిని మరోసారి చాటుతున్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు.

గుంటూరు రాజకీయం వేడెక్కింది. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ నేతృత్వంలో కూటమి నాయకులు ప్రలోభాలకు తెరలేపారు. మెజారిటీ లేకపోయినా కౌన్సిల్‌పై పట్టు సాధించేందుకు స్టాండింగ్ కమిటీ ఎన్నికలను పావుగా వాడుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను సంతలో పశువుల్లా బేరాలు చేసి మరీ తమ పార్టీలో చేర్చుకుంటున్నారు. స్థాయీ సంఘం ఎన్నిక మరో రెండు రోజుల్లో ఉండటంతో తమ కార్పొరేటర్లను కాపాడుకునేందుకు వైఎస్సార్ సీపీ చర్యలు చేపట్టింది. వారిని హైదరాబాద్‌కు తరలించింది. వైఎస్సార్ సీపీ నుంచి వచ్చిన కార్పొరేటర్లు మళ్లీ వెనక్కి వెళ్లిపోతారనే భయంతో తెలుగుదేశం పార్టీ కూడా క్యాంపునకు తరలించింది.

కమిషనర్‌ను అడ్డం పెట్టుకొని...

కౌన్సిల్‌పై పట్టు చేజిక్కించుకునేందుకు అడ్డదారులు తొక్కడానికి సిద్ధమైన కూటమి నేతలు ఏకంగా మున్సిపల్ కమిషనర్‌ను అడ్డం పెట్టుకుని రంగంలోకి దిగారు. గత నెల 4వ తేదీన కమిషనర్ పులి శ్రీనివాసులు కౌన్సిల్ సమావేశాన్ని బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించి అర్ధాంతరంగా ఆగిపోయిన కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని మేయర్ లేఖ రాస్తే సమావేశం పెట్టకుండా స్థాయీ సంఘం ఎన్నికల తేదీలను కమిషనర్ ప్రకటించారు. నిబంధనలను గాలికి వదిలేసిన అధికారికి ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. మరోవైపు స్థాయీ సంఘంలో తమకు ఏ మాత్రం స్థానాలు వచ్చే అవకాశం లేకపోయినా పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశాల మేరకు స్థానిక తెలుగుదేశం ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, నసీర్ అహ్మద్‌లు రంగంలోకి దిగారు. తమ పరిధిలో ఉన్న కార్పొరేటర్లకు గాలం వేయడం మొదలు పెట్టారు. ఒక్కో కార్పొరేటర్‌కు రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇస్తామని ప్రలోభాలకు గురిచేశారు. అనేక రకాలుగా ఒత్తిళ్లు తీసుకువచ్చి వారి ఇంటికి వెళ్లి మరీ కండువా కప్పి వస్తున్నారు. ఇలా వారం రోజుల్లోనే కొంతమందిని తమవైపు తిప్పుకున్నారు.



బలం లేకున్నా ప్రయత్నాలు

తమకు ఏ మాత్రం బలం లేకపోయినా అన్ని స్థానాలకూ కూటమి సభ్యులు నామినేషన్లు వేశారు. వైఎస్సార్ సీపీ నుంచి నామినేషన్లు వేసిన వారిని ప్రలోభాలకు గురిచేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కక్కిన కూడుకు ఆశ పడటం సరికాదని పార్టీ జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ విధంగా కొనుగోళ్లకు దిగలేదని గుర్తు చేశారు. అయితే ఈ వ్యవహారాన్ని పెమ్మసాని చంద్రశేఖర్ నిస్సిగ్గుగా సమర్థించుకోవడమే కాకుండా, అదే రోజున ఒక కార్పొరేటర్‌కు కండువా కప్పి తమ పార్టీలో చేర్చుకున్నారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ కార్పొరేటర్లను కొనుగోలు చేసి గుంటూరు నగరపాలక సంస్థలో పాగా వేయడానికి కూటమి చేస్తున్న ప్రయత్నాల పట్ల ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది.

న్యూస్‌రీల్

మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక బాధ్యతల స్వీకారం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. చంద్రిక మిర్చి కార్యదర్శిగా ఏడాదిపాటు డిప్యుటేషన్ మీద కొనసాగనున్నారు. చంద్రిక మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గుంటూరు మిర్చి యార్డుకు పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకునేందుకు యార్డుకు వచ్చే మిర్చి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని స్పష్టం చేశారు. యార్డు అధికారులు, సిబ్బంది సహకారంతో గుంటూరు మిర్చి యార్డును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని ఆమె వివరించారు. పలువురు యార్డు అధికారులు, సిబ్బంది, పలు అసోసియేషన్ల నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రికను కలిసి అభినందనలు తెలియజేశారు.

శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



తెనాలి: స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, శోభా యాత్ర జరిగాయి. వేకువజామునే సుప్రభాతం, విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం సత్రం కమిటీ పాలకవర్గ సభ్యులు వైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అమ్మవారికి 11 పర్యాయాలు పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా 102 మంది ఆర్య వైశ్య కన్యలచే కలశాలతో పట్టణంలో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అమ్మవారిని, ప్రాంగణంలోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి, నగరేశ్వరస్వామి వార్లను మంత్రి దర్శించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, వుప్పల వరదరాజులు, కొణిజేటి గోపికృష్ణ, గ్రంధి విశ్వేశ్వరరావు, నాళం రజనీ కుమార్, మద్దాళి శేషాచలం, ముప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దూరవిద్య బీఎల్ఐఎస్‌సీ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం గత అక్టోబర్, నవంబర్ నెలలో నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ (బీఎల్ఐఎస్‌సీ) కోర్సు మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు విడుదల చేశారు. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో నుంచి పొందవచ్చునని వారు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, కోదండపాణి, ఉద్యోగులు టంకశాల వెంకటేశ్వర్లు, ఎల్ ఎస్.రాంబాబు, కంప్యూటర్ సెక్షన్ నిర్వాహకులు వలి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 106, బ్యాంక్ కెనాల్‌కు 130, తూర్పు కెనాల్‌కు 242, పశ్చిమ కెనాల్‌కు 120, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మమూరు కాలువకు 930 క్యూసెక్కులు విడుదల చేశారు.

'సాక్షి' కథనంతో జెడ్పీ యంత్రాంగంలో కదలిక

- టెన్త్ విద్యార్థులకు అల్పాహారానికి ఆగమేఘాలపై ఉత్తర్వులు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24,146 మంది విద్యార్థులకు లబ్ధి

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు అర్ధాకలితో తరగతులకు హాజరవుతున్న దుస్థితిని వెలుగులోకి తెస్తూ ''పది చదువులు చిందర వందర'' శీర్షికతో శుక్రవారం ''సాక్షి''లో ప్రచురించిన కథనం జెడ్పీ అధికార యంత్రాంగంలో కదలిక తెచ్చింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ హైస్కూళ్లలో చదువుతున్న 24,146 మంది విద్యార్థులకు నెలరోజుల పాటు అల్పాహారాన్ని అందించేందుకు జెడ్పీ నిధుల నుంచి రూ.54,32,850లను మంజూరు చేస్తూ జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు శుక్రవారం ఆగమేఘాలపై ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో విద్యార్థికి సాయంత్రం వేళలో అల్పాహారాన్ని అందించేందుకు రోజుకు రూ.7.50 చొప్పున కేటాయించారు. ఈ విధంగా గుంటూరులోని జిల్లాలోని 146 పాఠశాలల్లో చదువుతున్న 9,070 మందికి రూ.20,40,750, పల్నాడు జిల్లాలోని 183 హైస్కూళ్లలో 11,233 మందికి రూ.25,27,425, బాపట్ల జిల్లాలోని 79 హైస్కూళ్లలో 3,843 మందికి రూ.8,64,675 చొప్పున నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సంబంధిత నిధులను ఆయా జిల్లాల విద్యాశాఖాధికారుల బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. జెడ్పీ సెక్టోరియల్ కాంట్రిబ్యూషన్ – ఎడ్యుకేషన్ ఫండ్ నుంచి మంజూరు చేసిన నిధులకు మూడు జిల్లాల పరిధిలోని ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఖాతాలకు జమ చేయాలని డీఈవోలకు సూచించారు. విద్యార్థులకు పౌష్టికాహారం రూపంలో అరటి పండ్లు, బ్రిటానియా, సన్‌ఫీస్ట్ బిస్కెట్లు, కోడిగుడ్లు, వేరుశెనగ ఉండలు, గుగ్గిళ్లు (అలసందలు, పెసలు) వంటి తినుబండారాలను అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



పది చదువులు
చిందర వందర!

సాక్షి ప్రచురించిన కథనం

రెండు రోజుల్లో స్టడీ మెటీరియల్

''పది చదువులు చిందర 'వంద'ర '' శీర్షికతో శుక్రవారం ''సాక్షి''లో ప్రచురించిన కథనానికి జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అంతకుముందు స్పందించారు. విద్యార్థులను టెన్త్ పబ్లిక్ పరీక్షలకు సిద్ధం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద రోజుల కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీఈఆర్టీ నుంచి మోడల్ పేపర్లను తెప్పించి విద్యార్థులతో చదివిస్తున్నామని పేర్కొన్నారు. జెడ్పీ పాలకవర్గంతో సంప్రదింపులు జరిపిన పిదప ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేల మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్, అల్పాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల కోసం వైఎస్సార్ సీపీ ఉద్యమ బాట

- ఫిబ్రవరి 5న ఫీజు పోరు
- గుంటూరులో పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మేయర్ కావటి మనోహర్ నాయుడు

పట్నంబజారు: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల్ని చెల్లించకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులను చదువులకు దూరం చేస్తోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ధ్వజమెత్తారు. దీనికి నిరసనగా విద్యార్థుల కోసం ఉద్యమబాట పట్టనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 5వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పోరుబాట చేపడుతున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ తలపెట్టిన ఫీజు పోరుకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన పోస్టర్‌ను గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, ఇతర విద్యార్థి నేతలు, పార్టీ ముఖ్యులతో కలిసి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చిన్నా బత్తిన వినోద్ ఆధ్వర్యంలో శుక్రవారం బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆలస్యం చేయడం వల్ల వారు చదువులు ఆపాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దీని పర్యవసానం సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రంగా ఉందని చెప్పారు. పిల్లల ఫీజులకు డబ్బులు లేక తల్లిదండ్రులు అప్పులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పరిణామం కాదన్నారు. 2018–19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బకాయి పెట్టి పోయిన రూ.1,800 కోట్లను వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే విధంగా 2023–24లో ఎన్నికల కోడ్ కారణంగా ఏర్పడిన బకాయిలు చెల్లించాల్సిన బాధ్యత నుంచి ప్రస్తుత కూటమి ప్రభుత్వం పక్కకు తప్పుకోవడం సమంజసం కాదన్నారు. ఆ బకాయిలతో కలిపి, ఇప్పటి వరకు రూ.3,900 కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు. లక్షల మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సంబంధించిన ఈ అంశంలో ఇంకా జాప్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్న ఫీజు పోరును విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.18 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాలు విజయవంతంగా అమలైన నిజం అందరికీ తెలిసిందేనన్నారు. ఏ ఏడాదికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అదే ఏడాదిలో నేరుగా తల్లుల ఖాతాల్లోకి జమ చేసినట్లు చెప్పారు. ప్రతి త్రైమాసికంలో నేరుగా తల్లుల ఖాతాల్లోకి నగదు జమ చేసిన ఘనత వైఎస్ జగన్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మందపాటి శేషగిరిరావు, బాలిరెడ్డి, సురసాని వెంకటరెడ్డి, మేకా రవి, విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బడే జగదీష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గురిజెట్టి రవి, గంటి, జిల్లా ప్రధాన కార్యదర్శులు మస్తాన్, కరీం, రాజేష్, అజయ్, జిల్లా సంయుక్త కార్యదర్శులు సాజిద్, కిరణ్, అరుణ్, వర్మ, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆశ పడ్డారు... మోసపోయారు

- రెట్టింపు నకిలీ నోట్లు ఇస్తామంటూ బురిడీ
- రూ.15 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): అసలు కరెన్సీకి డబుల్ దొంగ కరెన్సీ ఇస్తామని ఆశ చూపిన వ్యక్తి చేతిలో మోసపోయిన ఘటన మంగళగిరి కాజ టోల్‌గేటు వద్ద గురువారం రాత్రి జరిగింది. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పేరేచర్లలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న వ్యక్తికి చిత్తూరు జిల్లాలో ఓ మహిళ పరిచయమైంది. ఆమెతో నకిలీనోట్ల గురించి ప్రస్తావించాడు. రూ.15 లక్షలు అసలు నోట్లు ఇస్తే రెట్టింపు నకిలీనోట్లు ఇస్తామని ఆశ చూపించాడు. ఆ మహిళ ఈ విషయాన్ని తనకు తెలిసిన వాళ్లకు తెలియజేసింది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాకు చెందిన పగడాల జ్యోతి, వెంకటాచలం విశ్వనాథ్ దంపతులు ఆ మధ్యవర్తి ద్వారా డబ్బు ఇస్తానన్న వ్యక్తిని సంప్రదించారు. డబ్బులు తీసుకుని మంగళగిరి మండల పరిధిలోని కాజ టోల్‌గేటు వద్దకు రమ్మని ఆ వ్యక్తి చెప్పడంతో గురువారం రాత్రి 10.30 నిమిషాలకు పగడాల జ్యోతి, వెంకటాచలం విశ్వనాథ్‌లు రూ.15 లక్షల అసలు నోట్లను తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి మరో వ్యక్తితో పథకం ప్రకారం టోల్‌గేటు వద్ద వేచి ఉన్నాడు. అనంతరం ఆ దంపతుల దగ్గర నగదు తీసుకున్నాడు. రూ.30 లక్షల నకిలీ నోట్లను ఒక సూట్‌కేసులో పెట్టి ఇచ్చాడు. నిమిషాల వ్యవధిలోనే పోలీసులు పోలీసులు అంటూ హడావిడి చేసి అక్కడి నుండి పారిపొమ్మని ఆ దంపతులను హెచ్చరించాడు. ఆ దంపతులు భయపడి సూట్‌కేస్ తీసుకుని అక్కడి నుండి వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్లిన తరువాత సూట్‌కేస్ ఓపెన్ చేసి చూడగా నోట్ల కట్టలలో పైన కింద నోట్లు తప్ప మధ్యలో అన్నీ తెల్లకాగితాలు ఉండడం చూసి అవాక్కయ్యారు. బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన ముఖ్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియమావళిపై అవగాహన ముఖ్యమని నోడల్ అధికారులకు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహలతో కలిసి నోడల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోడల్ అధికారులు ఎన్నికల నియమావళిని అర్థం చేసుకుని విధులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో నోడల్ అధికారులు డీఆర్ఓ షేక్ ఖజావలి, సీపీఓ శేషశ్రీ, డీటీసీ కె. సీతా రామిరెడ్డి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనరు ఓబులేసు, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, బిమల్ కుమార్, పీడీలు ప్రసాద్, బి.శంకర్, విజయలక్ష్మి, జిల్లా ఉపాధి అధికారిణి దుర్గాబాయి, డీఎస్ఓ కోమలి పద్మ, డీపీఓకే నాగసాయి కుమార్, సమాచార శాఖ ఉప సంచాలకులు అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు. ఏసీ కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపర్చే గదులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్‌ను కలెక్టర్ పరిశీలించారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో విచారణ

- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించటంతో మహిళ మృతి
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యులను విచారించిన జేడీ



వైద్యులను విచారిస్తున్న జాయింట్ డైరెక్టర్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన ఘటనపై విచారణ జరిపేందుకు సెకండరీ హెల్త్ విభాగ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. రమేష్ కిషోర్ శుక్రవారం తెనాలి వచ్చారు. తల్లీపిల్లల వైద్యశాలలో ఆపరేషన్ చేసిన సీనియర్ వైద్యులు డాక్టర్ రాంబాబు, ఇతర వైద్యులను అడిగి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. జేడీ మాట్లాడుతూ మంగళగిరి మండలం యర్రబాలెంకు చెందిన గాజుల పావని ప్రసవం జరిగి 10 సంవత్సరాలు దాటిన తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు ఈ నెల 24వ తేదీ వచ్చిందని తెలిపారు. పీపీ యూనిట్ సీనియర్ వైద్యులు డాక్టర్ రాంబాబు, మరో సర్జన్ డాక్టర్ సింహాచలం సహకారంతో ఆమెకు ఆపరేషన్ చేశారన్నారు. మరుసటి రోజు ఆమెకు కడుపులో ఉబ్బరం రావటంతో స్కానింగ్ చేసి లోపల ఇబ్బంది ఉండటంతో గుంటూరుకు రిఫర్ చేశారని చెప్పారు. ఆ తర్వాత ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరపాలని సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించటంతో తెనాలి వచ్చినట్లు తెలిపారు. సాధారణంగా డెలివరీ జరిగిన వెంటనే ఆపరేషన్ చేయించుకుంటే ఎటువంటి ఇబ్బందులు రావని, కొన్ని సంవత్సరాల తర్వాత అయితే సమస్యలు వస్తుంటాయని చెప్పారు. పీపీ యూనిట్ తమ పరిధిలోది కాదని, వైద్యశాల తమ పరిధిలో ఉండటంతో విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. గుంటూరు వైద్యశాలలో కూడా దీనిపై విచారణ జరిపి సమగ్ర నివేదికను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మజీదా బేగం, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 70,952 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 61,331 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 70,952 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,900** గరిష్ఠం : రూ. **3,300**

మోడల్ ధర రూ. **3,100**

క్లుప్తంగా

మద్యం దుకాణంలో చోరీ

సుమారు రూ.2.50లక్షల నగదు అపహరణ



సీసీ కెమెరాలో నమోదైన చోరీ దృశ్యం



దుకాణం పై భాగంలో చేసిన కన్నం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మద్యం దుకాణంలో చోరీ జరిగిన సంఘటన గురువారం అర్ధ రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కాజ జాతీయ రహదారి వెంబడి సర్వీస్‌రోడ్డు పక్కనే వున్న బుడ్డి వైన్స్‌లో గురువారం అర్ధరాత్రి మద్యం దుకాణం పైకప్పు కట్ చేసి దొంగ లోపలకు చొరబడ్డాడు. దొంగ ఒంటిపై దుస్తులు ఏమీ లేకుండా లోపల డ్రాయర్‌తో ముఖం కనబడకుండా ఒక కవర్ కప్పుకొని లోపలికి వెళ్లాడు. డెస్క్‌లో వున్న సుమారు రూ.2.50లక్షలు అపహరించుకు పోయాడు. పొద్దున్నే దుకాణ యజమాని, సిబ్బంది దుకాణం తెరచి చూడగా డెస్క్ పగలకొట్టి ఉండడం గమనించారు. గురువారం రాత్రి మద్యం దుకాణంలో వచ్చిన సొమ్మును ఆ డెస్క్‌లోనే పెట్టి ఇంటికి వెళ్లినట్లు చెప్పారు. వెంటనే మంగళగిరి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ ఎస్‌ఐ వెంకట్ మద్యం దుకాణాన్ని, లోపలి సీసీ కెమెరా పుటేజీని పరిశీలించారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం

విద్యార్థులకు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, వేదిక పై విద్యార్థి సంఘ నాయకులు

లక్ష్మీపురం: నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దామని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ 49వ జిల్లా మహాసభలు గుంటూరు జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని నూతన జాతీయ విద్యా విధానం వల్ల జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు పడిపోయాయని తెలిపారు. విద్య పూర్తిగా ప్రైవేటు పరం అవుతుందని తెలిపారు. దేశంలో విద్యార్థులకు ఉచిత విద్య అందించాల్సిన ప్రభుత్వం తమ బాధ్యత నుంచి తప్పించుకుంటుందని కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీలకు విద్యను కట్టపెట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. యూనివర్సిటీలకు వీసీ నియామకాలను కేంద్ర ప్రభుత్వం గుప్పెట్లోకి తీసుకుంటుందని యూజీసీకి సంబంధం లేకుండా గవర్నర్లే వి.సిలను నియమించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. విద్య వ్యాపారీకరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున భవిష్యత్తులో పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని మహాసభ ద్వారా పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటివరకు తల్లికి వందనం పథకం అందజేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్కే సమీర్, జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా ఉపాధ్యక్షురాలు కె.నవిత, సహాహి కార్యదర్శి ఎ.యశ్వంత్, పవన్, సుభాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు.. తీర్పే కాదు

కాంగ్రెస్ పార్టీ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



మాట్లాడుతున్న చింతా మోహన్

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఎస్సీ వర్గీకరణపై ఏడుగురు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పు తీర్పే కాదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ, సూపర్ 6 హామీల అమలులో జాప్యం వల్ల చంద్రబాబు చెడ్డీ ఊడిపోతుందన్నారు. దళితుల విభజన జోలికిపోతే చంద్రబాబు నష్టపోతాడని, నారా లోకేష్ కంటున్న కలలు కలలుగానే మిగులుతాయన్నారు. ఎస్సీలు, ఓబీసీలు కలిసి ముందుకు వెళ్లి, యూపీలో లాగా, ఏపీలో రాజ్యాధికారం సాధించాలన్నారు. స్టాలిన్, సిద్ద రామయ్య, ములాయం సింగ్ యాదవ్, అఖిలేష్ యాదవ్, లల్లూ ప్రసాద్ యాదవ్‌లు ఓబీసీ వర్గం నుంచి ముఖ్యమంత్రులయ్యారని, ఏపీలో ఓబీసీ ముఖ్యమంత్రి ఎందుకు కాలేకపోతున్నారని అన్నారు. గాంధీ, నెహ్రూ, అంబేడ్కర్ కృషి వల్ల కాంగ్రెస్ పార్టీ ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఏడున్నర శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయ మూర్తులు రిజర్వేషన్లపై ఇచ్చిన జడ్జిమెంట్ పిచ్చి వాళ్లు కూడా రాయరన్నారు. తమిళనాడులో స్టాలిన్, కేరళలో విజయన్, బీజేపీ యూపీ సీఎం యోగిలు సుప్రీంకోర్టు తీర్పును పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు మాత్రం మిశ్రా ఏకసభ్య కమిషన్ వేశారని, ఈ చర్య తప్పన్నారు. ఆ కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. గుంటూరులో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉగాదిలోపు ఒక్కొక్కరికీ ఐదు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చింతా మోహన్ డిమాండ్ చేశారు.

లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

మంగళగిరి (తాడేపల్లిరూరల్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర పరిధిలోని ఎస్ఆర్ఐ వై జంక్షన్ వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. లారీ డ్రైవర్ లారీని ఆపకుండా వెళ్లిపోయాడు. స్థానికంగా చూసిన కొంత మంది లారీని వెంబడించి లారీని ఆపి పోలీసులకు సమాచారం అందించారు. లారీ ఢీకొట్టడంతో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల చెల్లాచెదురు కావడంతో గుర్తుపట్టలేని విధంగా ఉండడంతో వివరాలు తెలియరాలేదు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

పంటపొలాల్లో మహిళ మృతదేహం

- కుళ్లిపోయిన స్థితిలో గుర్తించిన రైతులు
- గుట్టు చప్పుడు కాకుండా మార్చురీకి తరలించిన పోలీసులు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా, తాడేపల్లి రూరల్ పరిధిలోని కొలనుకొండలో చోటుచేసుకున్న దారుణం ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. జరిగిన సంఘటనపై కనీసం పోలీసులు నోరు విప్పకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. సేకరించిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం సమయంలో కొలనుకొండ దగ్గర సాయిబాబా గుడి, గుంటూరు చానల్ రోడ్డులో ఓ ఖాళీ ప్లాట్‌లో మహిళ మృతదేహం వుందని పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు రాత్రి సమయంలో ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి మార్చురీకి తరలించారు. అక్కడ వున్న పరిస్థితులను బట్టి ఆ మహిళ మృతిచెంది సుమారు 5–6 రోజులు అయి ఉంటుదని స్థానికులు భావిస్తున్నారు. మృతురాలు ఎర్రరంగు చీర, ఎర్రరంగు జాకెట్ ధరించి ఉంది. జాతీయ రహదారి నుంచి సుమారు 800 మీటర్లు దూరంలోకి ఆ మహిళ ఎందుకు వచ్చింది అనే ప్రశ్నలు స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా వ్యక్తులు రాత్రి సమయంలో ఆ మహిళను ఇక్కడకు తీసుకువచ్చి లైంగికదాడి చేసి, చంపేశారా? లేదా హైవే పక్కన జాతీయ రహదారి వెంబడి ఈ మధ్యకాలంలో వ్యభిచార వృత్తిలో వున్న వారు అక్కడకు వెళితే ఏదైనా సంఘటన జరిగి ఉంటుందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మహిళ వివరాలు వెల్లడించలేదంటే హత్య అయి ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సంఘటనా స్థలం వద్ద పూర్తి వివరాలు సేకరించకుండా ఆ మహిళ మృతదేహాన్ని హడావుడిగా మార్చురీకి తరలించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళను ఎవరో తీసుకువచ్చి హత్యచేసి ఉంటారని, పగటి సమయంలో హత్య చేయడానికి ఆస్కారం ఉండదని, ఆ మహిళ మృతదేహం ఉన్న ప్రాంతంలో విల్లాల నిర్మాణం జరుగుతుండడంతో జన సంచారం ఉంటుందని, అంతేకాకుండా నిత్యం ఆ రహదారిలో రైతులతో పాటు వ్యవసాయ కూలీలు, పశువుల కాపర్లు సంచరిస్తుంటారని, ఎవరూ లేని సమయంలో మూడు పక్కల గోడ వున్న ప్రదేశంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బహుశా లైంగికదాడి జరగడం వల్లే పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చనిపోయిన మహిళ స్థానిక మహిళా, లేదా ఎక్కడి నుంచైనా మృతదేహాన్ని తీసుకువచ్చిన ఇక్కడ పడవేశారా అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

ధ్రువపత్రాల జారీపై అవగాహన అవసరం

వైటల్ స్టాటిస్టిక్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

తెనాలిఅర్బన్: వాట్సాప్‌లో జనన, మరణాల ధ్రువపత్రాలను జారీ చేసే విధానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వైటల్ స్టాటిస్టిక్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేసే రిజిస్ట్రార్‌లు, కంప్యూటర్ ఆపరేటర్లతో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తెనాలిలో ప్రయోగాత్మకంగా వీటిని జారీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. మొదట తెనాలిలో వీటిని జారీ చేసి లోటుపాట్లు పరిశీలించడం జరుగుతుందన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైతే రాష్ట్ర మొత్తం అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా ప్రస్తుతం వీటిని జారీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్ ద్వారా తెనాలిలో వీటిని జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ పద్మజ, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ హెలెన్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మరొకరికి గాయాలు



తీవ్రగాయాలతో మృతి చెందిన పరిశుద్ధరావు

గుంటూరు రూరల్: నగర శివారు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధి ఓబులు నాయుడుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనంపై చిలకలూరిపేట వైపునుంచి వస్తున్న ఇరువురు యువకులు డివైడర్‌ను ఢీకొన్నారు. ప్రమాదంలో ఒక యువకుడు ఓవర్ బ్రిడ్జి పైనుంచి సర్వీస్ రోడ్డు కిందకు పడిపోయాడు. సంఘటనలో బ్రిడ్జి పైనుంచి పడిన నెహ్రూనగర్‌కు చెందిన పి.పరిశుద్ధరావు (27) తీవ్రగాయాలతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ద్విచక్ర వాహనంపై ఉన్న మరొక యువకుడికి చేతికి గాయమైనట్లు తెలిసింది. యువకులు ఇరువురు గుంటూరు నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన వారని క్షతగాత్రులను అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిర్వహించి మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వంశీధర్ తెలిపారు.